ఫ్రాన్స్ వేదికగా ఈనెల 3-7 మధ్య జరిగిన సెయింట్ డెనిస్ లీ యూనియన్ ఇంటర్నేషనల్ చాలంజ్ టోర్నమెంట్‌లో హైదరాబాదీ యువ షట్లర్ తరుణ్ చౌదరి టైటిల్ కైవసం చేసుకున్నాడు. ఫైనల్‌లో తరుణ్ 21-15, 21-15తో యుడాయ్ ఒకిమొటొ (జపాన్)ను ఓడించాడు.

ముగిసిన రజావత్ పోరాటం

కాల్గరీ (కెనడా): కెనడా ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత యువ షట్లర్ ప్రియాన్షు రజావత్ పోరాటం సెమీస్‌లోనే ముగిసింది. టోర్నీ ఆసాంతం తనకంటే మెరుగైన ర్యాంకర్లను ఓడించి సంచలనాలు నమోదుచేసిన రజావత్ కీలక సెమీస్‌లో మాత్రం చేతులెత్తేశాడు. ఆదివారం జరిగిన పురుషుల సెమీఫైనల్‌లో రజావత్ 17-21, 10-21తో అలెక్స్ లేనియర్ (ఫ్రాన్స్) చేతిలో ఓడిపోయాడు. 45 నిమిషాల్లోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో ఆది నుంచే అలెక్స్ ధాటిగా ఆడి వరుస సెట్లతో పాటు మ్యాచ్‌నూ సొంతం చేసుకుని ఫైనల్ చేరాడు.

కార్గిల్ దివస్ సిల్వర్ జూబ్లీ సందర్భంగా కన్యాకుమారి నుంచి కార్గిల్ వరకు సైకిల్ యాత్ర నిర్వహిస్తోన్న ఆశా మాల్వీయ ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసింది. మధ్యప్రదేశ్‌కు చెందిన ఆశా గత నెల 24 నుంచి ఈ యాత్రను ప్రారంభించింది.

భారత్ బోణీ

- అభిషేక్ సుడిగాలి శతకం
- రాణించిన రుతురాజ్, అవేశ్
- ఛేదనలో తేలిపోయిన జింబాబ్వే
- రెండో టీ20లో టీమ్‌ఇండియా ఘన విజయం

జింబాబ్వే పర్యటనలో యువ భారత్ బోణీ కొట్టింది. తొలి టీ20లో తమకు ఊహించని షాకిచ్చిన ఆతిథ్య జట్టుపై 24 గంటలు గడవకముందే కసిగా ప్రతీకారం తీర్చుకుంది. తొలి మ్యాచ్‌లో డకౌట్ అయినా క్రీజులో నిలబడితే తానెంత ప్రమాదకర ఆటగాడో అభిషేక్ శర్మ రెండో టీ20తో చెప్పకనే చెప్పాడు. హరారేలో అభిషేక్ తుఫాను తర్వాత రుతురాజ్ గైక్వాడ్, రింకూ సింగ్ విధ్వంసకర ఆటతీరుతో భారత్ రికార్డు స్కోరు చేసింది. అనంతరం భారీ ఛేదనలో మన పేసర్లు ముకేశ్, అవేశ్ ధాటికి జింబాబ్వే బ్యాటింగ్ ఆర్డర్ అతలాకుతలమైంది.

అభిషేక్ (100)

1 భారత్ తరఫున టీ20లలో ఆడిన రెండో మ్యాచ్‌కే శతకం చేసిన మొదటి బ్యాటర్ అభిషేక్. దీపక్ హుడా (3), కెఎల్ రాహుల్ (4) తదుపరి స్థానాల్లో ఉన్నారు.

4 బంతులపరంగా అభిషేక్‌ది నాలుగో వేగవంతమైన సెంచరీ. రోహిత్ (35), సూర్య (45), కెఎల్ రాహుల్ (46) ముందున్నారు.

2 ఈ ఫార్మాట్‌లో జింబాబ్వేను వంద పరుగుల తేడాతో ఓడించిన రెండో జట్టు భారత్. తొలి స్థానం ఆసీస్‌ది.

హరారే: సీనియర్ల గైర్హాజరీలో జింబాబ్వే పర్యటనకు వెళ్లిన యువ భారత్ బోణీ కొట్టింది. తొలి మ్యాచ్‌లో తమను ఓడించిన ఆతిథ్య జట్టుపై అన్ని విభాగాల్లోనూ సంపూర్ణ ఆధిపత్యం చెలాయించి వంద పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున ఆడుతూ అదిరిపోయే ప్రదర్శనలతో జాతీయ జట్టులో చోటు దక్కించుకున్న యువ ఓపెనర్ అభిషేక్ శర్మ (47 బంతుల్లో 100, 7 ఫోర్లు, 8 సిక్సర్లు) అంతర్జాతీయ కెరీర్‌లో ఆడిన రెండో మ్యాచ్‌లోనే సుడిగాలి శతకం బాదాడు. అతడికి తోడుగా రుతురాజ్ గైక్వాడ్ (47 బంతుల్లో 77 నాటౌట్, 11 ఫోర్లు, 1 సిక్స్), రింకూ సింగ్ (22 బంతుల్లో 48 నాటౌట్, 2 ఫోర్లు, 5 సిక్సర్లు) వేగంగా ఆడటంతో మొదట బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 234 పరుగుల రికార్డు స్కోరు చేసింది. భారీ ఛేదనలో జింబాబ్వే 18.4 ఓవర్లలో 134 పరుగులకే ఆలౌట్ అయింది. వెస్లీ మధ్వెర (39 బంతుల్లో 43, 3 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్. భారత బౌలర్లలో ముకేశ్ కుమార్ (3/37), అవేశ్ ఖాన్ (3/15), రవి బిష్ణోయ్ (2/11) రాణించారు. అభిషేక్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

అభిషేక్ తుఫాను: టాస్ నెగ్గి మొదట బ్యాటింగ్ చేసిన భారత్ రెండో ఓవర్లోనే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (2) వికెట్‌ను కోల్పోయింది. కానీ అతడి స్థానంలో వచ్చిన రుతురాజ్‌తో కలిసి అభిషేక్ భారత ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. ఎదుర్కొన్న తొలి బంతినే డీప్ బ్యాక్‌వర్డ్ స్క్వేర్ దిశగా భారీ సిక్సర్‌తో ఖాతా తెరిచిన అతడు.. గిల్ నిష్క్రమణ తర్వాత జోరు తగ్గించాడు. కానీ అది తుఫాను ముందు ప్రశాంతతే. 8వ ఓవర్ తర్వాత మొదలైంది అసలు విధ్వంసం. సికిందర్ రజా వేసిన 9వ ఓవర్లో 4, 6తో బాదుడుకు శ్రీకారం చుట్టిన అభిషేక్.. డియోన్ 11వ ఓవర్లో ఫోర్, సిక్సర్‌తో 33 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేశాడు. ఆ తర్వాత వరుసగా 4, 6, 4 సాధించి ఆ ఓవర్లో 28 పరుగులు పిండుకున్నాడు. రజా 13వ ఓవర్లో రెండు ఫోర్లు, సిక్సర్‌తో 82 పరుగుల వద్దకు చేరుకున్నాక మసకద్జ వేసిన మరుసటి ఓవర్లోనే హ్యాట్రిక్ సిక్సర్లతో 46 బంతుల్లోనే అంతర్జాతీయ కెరీర్‌లో తొలి శతకాన్ని పూర్తిచేశాడు. రెండో ఫిఫ్టీకి అతడు తీసుకున్న బంతులు 13 మాత్రమే. సెంచరీ అయ్యాక మరుసటి బంతికే పెవిలియన్ చేరడంతో 137 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. ఆ తర్వాత రుతురాజ్‌కు రింకూ జతకలవడంతో భారత స్కోరు వాయువేగాన్ని తలపించింది. 38 బంతుల్లో ఫిఫ్టీ పూర్తిచేసుకున్న రుతురాజ్.. చటారా వేసిన 18వ ఓవర్లో ఓ సిక్సర్,మూడు బౌండరీలు బాదాడు. ఆఖరి ఓవర్లో రింకూ 2 భారీ సిక్సర్లు కొట్టాడు.

ముకేశ్, అవేశ్ ధాటికి విలవిల

కొండంత లక్ష్యాన్ని ఛేదించేందుకు క్రీజులో దిగిన జింబాబ్వే ఇన్నింగ్స్ మూడో బంతికే ఓపెనర్ కైయా (4) వికెట్ కోల్పోయింది. 3 సిక్సర్లు బాదిన బెన్నెట్ కూడా ముకేశ్ మూడో ఓవర్లో ఆఖరి బంతికి క్లీన్ బౌల్డ్ అయ్యాడు. 4వ ఓవర్లో బంతినందుకున్న అవేశ్ 4బంతుల వ్యవధిలో మైయర్స్, రజాను ఔట్ చేసి జింబాబ్వేను కోలుకోనీయకుండా చేశాడు. ఈ క్రమంలో జొనాథన్ (10) అండంతో వెస్లీ కొద్దిసేపు వికెట్ల పతనాన్ని అడ్డుకున్నాడు. కానీ బిష్ణోయ్ అతడిని క్లీన్ బౌల్డ్ చేశాడు. లోయరార్డర్ బ్యాటర్ లూక్ జాంగ్వి (33) కాస్త ప్రతిఘటించడంతో జింబాబ్వే ఆ మాత్రం స్కోరైనా చేయగలిగింది. ఇరుజట్ల మధ్య మూడో టీ20 బుధవారం ఇదే వేదికపై జరుగనుంది.

సంక్షిప్త స్కోర్లు

భారత్: 20 ఓవర్లలో 234/2 (అభిషేక్ 100, రుతురాజ్ 77 నాటౌట్, ముజర్బని 1/30, మసకద్జ 1/29)

జింబాబ్వే: 18.4 ఓవర్లలో 134 ఆలౌట్ (వెస్లీ 23, జాంగ్వి 33, అవేశ్ 3/15, ముకేశ్ 3/37)

రెండో టీ20 రద్దు

వర్షం అంతరాయంతో సాగని ఆట • భారత ఆశలపై నీళ్లు

చెన్నై: దక్షిణాఫ్రికా మహిళల క్రికెట్ జట్టుతో జరుగుతున్న టీ20 సిరీస్‌లో రెండో మ్యాచ్ నెగ్గి పుంజుకోవాలని భావించిన భారత ఆశలపై వరుణుడు నీళ్లు చల్లాడు. చెన్నైలో కురిసిన వర్షం కారణంగా మ్యాచ్ అర్ధాంతరంగా రద్దైంది. సఫారీ ఇన్నింగ్స్ ముగిశాక మొదలైన వాన ఎంతకూ తెరిపినివ్వకపోవడంతో అంపైర్లు ఆటను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. అంతకుముందు టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు వచ్చిన దక్షిణాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 177 పరుగులు చేసింది. బ్రిట్స్ (52) మరోసారి అర్ధ సెంచరీతో మెరవగా అన్నెకి బోష్ (40) రాణించింది. గత మ్యాచ్‌లో మాదిరిగానే సఫారీ బ్యాటర్లను కట్టడి చేయడంలో టీమ్‌ఇండియా బౌలర్లు విఫలమయ్యారు. దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ ముగిశాక మొదలైన వాన ఆటను సాగనివ్వకపోవడంతో మ్యాచ్ రద్దైంది. ఇరుజట్ల మధ్య కీలకమైన మూడో మ్యాచ్ మంగళవారం ఇదే వేదికపై జరుగుతుంది.

అవినాష్ జాతీయ రికార్డు

పారిస్: పారిస్ ఒలింపిక్స్‌కు ముందు భారత స్టీపుల్ చేజ్ రన్నర్ అవినాష్ సాబ్లె సరికొత్త జాతీయ రికార్డు సృష్టించాడు. పారిస్ వేదికగా జరుగుతున్న డైమండ్ లీగ్ పోటీలలో అవినాష్.. పురుషుల 3వేల మీటర్ల పరుగు పందెంను 8 నిమిషాల 09.91 సెకన్లలోనే పూర్తి చేశాడు. తద్వారా గతంలో తానే నెలకొల్పిన 8 నిమిషాల 11.20 సెకన్ల రికార్డును బద్దలుకొట్టాడు. ఈ ఈవెంట్‌లో సాబ్లె ఆరో స్థానంలో నిలిచాడు.

తెలంగాణ అమ్మాయికి స్వర్ణం

పవర్‌లిఫ్టింగ్‌లో మెరిసిన సుకన్యాబాయి

మహబూబాబాద్ రూరల్, జూలై 7: అంతర్జాతీయ వేదికపై తెలంగాణ గిరిజన అమ్మాయి తేజావత్ సుకన్యాబాయి సత్తాచాటింది. జిల్లాలోని సిరోలు మండలానికి చెందిన సుకన్య.. పోచఫ్‌స్ట్రూమ్ (సౌతాఫ్రికా) వేదికగా జరుగుతున్న అంతర్జాతీయ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం గెలుచుకుంది. మహిళల 76 కిలోల విభాగంలో పోటీపడ్డ ఆమె పసిడి నెగ్గింది. స్వర్ణం గెలిచిన అనంతరం ఆమె మాట్లాడుతూ.. అంతర్జాతీయ వేదికలపై దేశ కీర్తి పతాకను రెపరెపలాడిస్తానని చెప్పింది. ఈ సందర్భంగా తనకు సహకరిస్తున్న కోచ్‌లు, సహాయ సిబ్బందికీ కృతజ్ఞతలు తెలిపింది. స్వర్ణం గెలిచిన సుకన్యాబాయికి జిల్లా క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

క్వార్టర్స్‌కు అల్కారజ్, సిన్నర్

- స్వియాటెక్‌కు షాక్
- వింబుల్డన్ టోర్నీ

లండన్: డిఫెండింగ్ చాంపియన్ కార్లోస్ అల్కారజ్ వింబుల్డన్ క్వార్టర్స్‌కు దూసుకెళ్లాడు. ఆదివారం సెంటర్ కోర్ట్ వేదికగా జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్ మ్యాచ్‌లో ఈ స్పెయిన్ కుర్రాడు 6-3, 6-4, 1-6, 7-5తో ఉగో హంబర్ట్ (ఫ్రెంచ్)పై అలవోకగా గెలిచి క్వార్టర్స్ చేరాడు. మూడో రౌండ్‌లో టియోఫితో కష్టపడి నెగ్గిన అల్కారజ్‌కు ప్రిక్వార్టర్స్‌లో మాత్రం విజయం నల్లేరు మీద నడకలా సాగింది. మ్యాచ్‌లో 14 ఏస్‌లు సంధించిన అతడు.. 45 విన్నర్లు కొట్టి 6 డబుల్ ఫాల్ట్స్ చేశాడు. మరో మ్యాచ్‌లో ఒకటో సీడ్ జన్నిక్ సిన్నర్ (ఇటలీ) 6-2, 6-4, 7-6 (11/9)తో బెన్ షెల్టన్ (అమెరికా)ను ఓడించి క్వార్టర్స్‌లో ప్రవేశించాడు. కాగా మహిళల సింగిల్స్‌లో ప్రపంచ నెంబర్ వన్ ర్యాంకర్ ఇగా స్వియాటెక్ 6-3, 1-6, 2-6తో అన్‌సీడెడ్ యులియా పుటిన్‌సెవా (కజకిస్థాన్) చేతిలో ఓడి మూడో రౌండ్‌లోనే నిష్క్రమించింది. ఏడో సీడ్ జాస్మిన్ పలోని (ఇటలీ) 6-3, 6-7 (6/8), 5-5 తో మాడిసన్ కీస్ (అమెరికా)పై గెలిచి తన తొలి వింబుల్డన్ క్వార్టర్స్ చేరుకుంది. మూడో సెట్‌లో కీస్ కాలికి గాయమవడంతో ఆమె పోటీ నుంచి తప్పుకోవడంతో పలోని ముందంజ వేసింది.

యూరో సెమీస్ బెర్తులు ఖరారు

ముని‌చ్: జర్మనీ ఆతిథ్యమిస్తున్న ప్రతిష్టాత్మక యూరో కప్‌లో సెమీస్ బెర్తులు ఖరారయ్యాయి. శనివారం రాత్రి స్విట్జర్లాండ్‌తో ఆద్యంతం ఉత్కంఠగా జరిగిన మ్యాచ్‌ను ఇంగ్లండ్ గెలుచుకోగా టర్కీని నెదర్లాండ్స్‌ను ఓడించి సెమీస్‌కు దూసుకెళ్లాయి. ఇంగ్లండ్-స్విట్జర్లాండ్ మ్యాచ్ నిర్ణీత సమయానికి 1-1తో సమమైంది. కానీ పెనాల్టీ షూటౌట్‌లో ఇంగ్లండ్ 5 గోల్స్ చేయగా స్విస్ జట్టు 3 గోల్స్‌కే పరిమితమై ఓటమి వైపున నిలిచింది. నాలుగో క్వార్టర్స్ మ్యాచ్‌లో నెదర్లాండ్స్ 2-1తో టర్కీని ఓడించింది. బుధవారం నుంచి మొదలయ్యే తొలి సెమీస్‌లో స్పెయిన్.. ఫ్రాన్స్‌ను ఢీకొననుండగా గురువారం నెదర్లాండ్స్, ఇంగ్లండ్ మధ్య రెండో సెమీస్ జరుగనుంది.

ఒకడు నెగిటివ్.. ఒకడు పాజిటివ్?

ఇటీవల ఎయిర్‌పోర్ట్‌లో రాజమౌళి సినిమా కోసం మారిన మహేశ్‌బాబును చూసి, చేతుల్లో ఉన్న సెల్‌ఫోన్లకు పనిచెప్పేశారు జనాలు. లాంగ్ హెయిర్, పెరిగిన గడ్డం, టైట్‌గా ఉన్న టీషర్ట్ లోంచి కనిపిస్తున్న తిరిగిన కండలు వీటికితోడు నల్లకళ్లద్దాలు.. స్టయిల్‌గా నడుస్తూవచ్చి కారెక్కుతున్న సూపర్‌స్టార్‌ని చూసి అభిమానులు పులకించిపోయారు. ఈ వీడియో ప్రస్తుతం ఓ రేంజ్‌లో వైరల్ అవుతున్నది. ఈ లుక్ రాజమౌళి సినిమా కోసమే అని ప్రత్యేకించి చెప్పాల్సిన పని లేదు. తాజా అప్‌డేట్ ఏంటంటే.. ఇందులో మహేష్ ద్విపాత్రాభినయం చేస్తున్నారట. అందులోని ఓ పాత్ర నెగిటీవ్ షేడ్స్‌తో ఉంటుదని సమాచారం. అమేజాన్ అడవుల నేపథ్యంలో ఈ పాత్రే కీలకంగా ఉంటుందని ఇన్‌సైడ్ టాక్. మరో పాత్రలో ప్రపంచ యాత్రికుడిగా కనిపిస్తారట మహేశ్‌బాబు. ఈ సినిమా ఆర్టిస్టుల ఎంపిక కోసం టెస్ట్ షూట్ జరుగుతున్నది. కథ కూడా లాక్ అయ్యింది. ప్రస్తుతం డైలాగ్స్ పూర్తి చేసే పనిలో ఉన్నట్టు సమాచారం. ఇందులో మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమార్ ఓ కీలక పాత్ర పోషిస్తున్నారట. అలాగే హిందీ, తమిళ చిత్ర పరిశ్రమలకు చెందిన ప్రముఖ నటులు ఈ సినిమాలో నటించనున్నట్టు సమాచారం. ఆగస్టులో మ్యూజిక్ వర్క్ మొదలుపెడతానని ఇటీవలే కీరవాణి ప్రకటించారు. ఇందులో ఓ హీరోయిన్‌గా చెల్సీ ఎలిజబెత్ ఇస్లాన్ నటించనున్నట్టు వినికిడి.

ఆరేళ్ల కష్టాన్ని ఆదరిస్తారని ఆశిస్తున్నా: కమల్‌హాసన్

'50ఏళ్ల క్రితం హైదరాబాద్‌కి టెక్నీషియన్‌గా వచ్చాను. మూడు జనరేషన్స్‌గా నన్ను ప్రేమిస్తూ, స్నేహిస్తూ ఇంత దూరం తెచ్చారు. మీ అందరికీ రుణపడి ఉంటాను. 'భారతీయుడు' ఇండియన్ సినిమాను మరోస్థాయిలో నిలబెట్టింది. ముఖ్యంగా తెలుగు వెర్షన్ పెద్ద హిట్. 28ఏళ్ల తర్వాత మళ్లీ 'భారతీయుడు' వస్తున్నాడంటే కారణం ఇంకా లంచగొండితనం ఉండబట్టే. ఇది అందరూ అర్థం చేసుకోవాల్సిన విషయం. నేను ఈ సినిమాకి నటుడ్ని మాత్రమే కాదు. అభిమానిని కూడా. అంత అద్భుతంగా తీశాడు శంకర్. అలాగే 'భారతీయుడు 3' కూడా బావుంటుంది. మా ఆరేళ్ల కష్టాన్ని ఆదరిస్తారని ఆశిస్తున్నాను. తెలుగు ప్రేక్షకులు నన్ను స్టార్‌ని చేశారు. కె.బాలచందర్, కె.విశ్వనాథ్, శంకర్ లాంటి వాళ్లు సినిమాలు తీస్తే గొప్ప నటులు పుట్టుకొస్తారు.' అని కమల్‌హాసన్ అన్నారు. ఆయన కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన ప్రతిష్టాత్మక పాన్‌ఇండియా చిత్రం 'భారతీయుడు 2'. 'భారతీయుడు' సీక్వెల్‌గా రూపొందిన ఈ చిత్రాన్ని లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ నిర్మించారు. ఈ నెల 12న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో కమల్‌హాసన్ మాట్లాడారు. ' 'భారతీయుడు' వచ్చి 28ఏళ్లయ్యింది. ఇన్నేళ్లల్లో ఎప్పుడు పేపర్ చూసినా, లంచం తీసుకున్నారన్న న్యూస్ కనబడితే 'భారతీయుడు' గుర్తొచ్చేవాడు. అందుకే సెకండ్ పార్ట్ చేయాలని నిర్ణయించుకున్నా. కథ రెడీ చేసుకొని, 'రోబో 2.0' టైమ్‌లో కమల్‌సార్‌కి వినిపించాను. పాతికేళ్ల తర్వాత ఆయన ఆ గెటప్‌లో లొకేషన్స్‌కి వస్తుంటే గూజ్‌బమ్స్ వచ్చేశాయి. మనసులో తెలియని భక్తి, భయం. ఇండియాలో అలాంటి నటుడు లేడు. సిద్ధార్థ్ వంద సినిమాల అనుభవం ఉన్నట్టు నటించాడు. రకుల్ భాష తెలీకపోయినా సీన్ అర్థం చేసుకొని నటించింది. అందరూ బాగా చేశారు. ఇక 'గేమ్‌చేంజర్' విషయానికొస్తే.. రామ్‌చరణ్ పోర్షన్ పూర్తయింది. తనో తెలీని అద్భుతం. తన స్క్రీన్‌ప్రెజన్స్ గొప్పగా ఉంటుంది. అది రేపు అందరూ చూస్తారు' అని దర్శకుడు శంకర్ తెలిపారు. ఇంకా సిద్ధార్థ్, నడిముడి వేణు, కాజల్, రకుల్‌ప్రీత్‌సింగ్, బ్రహ్మానందం, ఎస్.జె.సూర్య, సముద్రఖని, బాబీ సింహా, సుద్దాల అశోక్‌తేజ, రామజోగయ్యశాస్త్రి, కాసర్లశ్యామ్ కూడా మాట్లాడారు. ఏషియన్ సురేష్ మూవీస్, శ్రీలక్ష్మీ ప్రొడక్షన్స్ తెలుగులో విడుదల చేస్తున్నారు.

ఆ టైటిల్ అనగానే భయమేసింది

'స్నేహితులందరూ కలిసి పనిచేసిన సినిమా ఇది. 'డార్లింగ్' అనగానే అందరికీ గుర్తొచ్చేది ప్రభాస్ అన్న. ఈ సినిమాకు ఆ టైటిల్ ఖరారు చేయగానే భయమేసింది. అయితే కథకు ఆ టైటిల్ యాప్ట్. అందుకే పెట్టాం. నిర్మాతలు పాషన్‌తో డబ్బుకు వెనుకాడకుండా సినిమాను నిర్మించారు. నా కోస్టార్ నభానటేష్ ఎక్స్‌ట్రార్డినరీగా నటించింది. వివేక్‌సాగర్ మ్యూజిక్ సూపర్. ఇలా అన్ని విధాలుగా ఈ సినిమా ఆకట్టుకుంటుంది' అని ప్రియదర్శి అన్నారు. ఆయన కథానాయకుడిగా రూపొందిన చిత్రం 'డార్లింగ్'. 'వైదిస్ కొలవెరి' అనేది ఉపశీర్షిక. నభానటేష్ కథానాయిక. అశ్విన్‌రామ్ దర్శకుడు. కె.నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి నిర్మాతలు. ఈనెల 19న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ట్రైలర్ లాంచ్ కార్యక్రమంలో ప్రియదర్శి మాట్లాడారు. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన హీరో విశ్వక్‌సేన్ ట్రైలర్‌ని ఆవిష్కరించి, చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు అందించారు. తాను యాక్సిడెంట్ నుంచి కోలుకున్న తర్వాత చేసిన సినిమా ఇదని, అద్భుతమైన కథ, ఆకట్టుకునే కేరక్టర్స్‌తో రూపొందిన ఈ సినిమా అందరికీ నచ్చుతుందని నభానటేష్ నమ్మకం వ్యక్తం చేసింది. సినిమా చాలా కొత్తగా, డిఫరెంట్‌గా ఉంటుందని, మంచి టీమ్‌తో కలిసి పనిచేయడం ఆనందంగా ఉందని దర్శకుడు చెప్పారు. ఇంకా నిర్మాత చైతన్యరెడ్డి కూడా మాట్లాడారు. చిత్రయూనిట్ మొత్తం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇన్నోసెంట్ పోలీస్ చారులతగా

నాని కథానాయకుడిగా రూపొందుతోన్న చిత్రం 'సరిపోదా శనివారం'. వివేక్ ఆత్రేయ దర్శకుడు. డి.వి.వి.దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మాతలు. ప్రియాంక అరుల్ మోహన్ కథానాయిక. ఆమె ఇందులో కానిస్టేబుల్ చారులతగా నటిస్తున్నది. ఆదివారం మేకర్స్ ప్రియాంక ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. అందమైన చిరునవ్వుతో ఖాకీ యూనిఫాం ధరించి, భుజంపై బ్యాగ్‌తో నడుచుకుంటూ వస్తున్న ఎన్నోసెంట్ పోలీస్‌కానిస్టేబుల్‌గా ప్రియాంకను ఈ లుక్‌లో చూడొచ్చు. ప్రతిష్టాత్మకంగా నిర్మితమవుతున్న ఈ చిత్రంలో ఎస్.జె.సూర్య కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రానికి కెమెరా: మురళి.జి, సంగీతం: జేక్స్ బిజోయ్, నిర్మాణం: డి.వి.వి.ఎంటర్‌టైన్‌మెంట్స్.

పొయెటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ తుఫాన్

'ప్రేక్షకులతో కలిసి ఈ సినిమా చూడాలని ఉంది. 'తుఫాన్' లాంటి గొప్ప సినిమా నాకిచ్చిన దర్శకుడు విజయ్ మిల్టన్‌కు థ్యాంక్స్. తను అద్భుతమైన దర్శకుడేకాదు, గొప్ప సినిమాటోగ్రాఫర్ కూడా. 'తుఫాన్' విజువల్స్ చూస్తే అది అర్థమవుతుంది. ఈ సినిమా నేపథ్యం కొత్తగా ఉంటుంది. అందరూ 'తుఫాన్'ని ఎంజాయ్ చేస్తారు.' అని విజయ్ ఆంటోని నమ్మకం వ్యక్తం చేశారు. ఆయన కథానాయకుడిగా రూపొందిన పొయెటిక్ యాక్షన్ ఎంటర్టైనర్ 'తుఫాన్'. మేఘా ఆకాష్ కథానాయిక. విజయ్ మిల్టన్ దర్శకుడు. కమల్ బోరా, డి.లలితా, బి.ప్రదీప్, పంకజ్ బోరా నిర్మాతలు. ఈ నెల 26న సినిమా విడుదల కానుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈవెంట్‌లో ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా విజయ్ ఆంటోనీ మాట్లాడారు. 'ఓ మంచి సినిమా చేసే అవకాశం ఇచ్చిన నిర్మాతలకు, మా హీరో విజయ్ ఆంటోనీకి థ్యాంక్స్ చెప్పుకుంటున్నాను. 'తుఫాన్' అందరికీ నచ్చుతుంది' అని దర్శకుడు చెప్పారు. తన కెరీర్‌లో 'తుఫాన్' ప్రత్యేకమైన సినిమా అని కథానాయిక మేఘా ఆకాష్ అన్నారు. ఇంకా నిర్మాతలతోపాటు చిత్ర యూనిట్ కూడా మాట్లాడారు. భాష్యశ్రీ సంభాషణలు అందించిన ఈ చిత్రానికి అచ్చు రాజమణితో కలిసి విజయ్ ఆంటోని స్వరాలందించారు.

చిత్రం

హైదరాబాద్ శివార్లలో రొమాంటిక్ సాంగ్?

తారక్ 'దేవర 1' షూటింగ్‌ను శరవేగంగా పూర్తి చేస్తున్నారు దర్శకుడు కొరటాల శివ. ఈ సినిమాకు సంబంధించిన బ్యాలెన్స్ సీక్వెన్స్ చిత్రీకరణ దాదాపు పూర్తి కావచ్చింది. వచ్చే వారం నుంచి ఎన్టీఆర్, జాన్వీకపూర్‌లపై ఓ రొమాంటిక్ సాంగ్‌ను ప్లాన్ చేశారు కొరటాల శివ. దీనికోసం హైదరబాద్ శివార్లలో భారీ సెట్‌ను కూడా నిర్మిస్తున్నారు. ఈ పాటతో 'దేవర 1' టాకీ మొత్తం పూర్తవుతుందని తెలుస్తున్నది. సైఫ్ అలీఖాన్ ఇందులో విలన్‌గా నటిస్తున్న విషయం తెలిసిందే. తారక్, సైఫ్ అలీఖాన్ కాంబినేషన్ సీన్స్ మాస్ ప్రేక్షకులను ఓ స్థాయిలో అలరిస్తాయని మేకర్స్ చెబుతున్నారు. సెప్టెంబర్‌లో విడుదల కానున్న ఈ సినిమాలో షైన్ టామ్ చాకో, శ్రీకాంత్, ప్రకాశ్‌రాజ్ ఇతర పాత్రధారులు. అనిరుధ్ ఈ సినిమాకు స్వరాలందిస్తున్న విషయం తెలిసిందే.

మునుపెన్నడూ చూడని కొత్త అవతారం

అల్లరి నరేశ్‌లో కామెడీ కంటే సీరియస్‌నే ఎక్కువ ఇష్టపడుతున్నారు ప్రేక్షకులు. నటుడిగా ఆయనకు మంచి పేరు తెచ్చిన సినిమాలన్నీ సీరియస్ రోల్సే కావడం అందుకు ఉదాహరణ. త్వరలోనే 'బచ్చల మల్లి'గా మరో సీరియస్ రోల్‌లో కనిపించనున్నారు అల్లరి నరేశ్. సుబ్బు మంగదేవి దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ చిత్రానికి రాజేశ్ దండా, బాలాజీ గుత్తా నిర్మాతలు. ప్రమోషన్‌లో భాగంగా విడుదల చేసిన ఈ సినిమా ప్రచార చిత్రాలకు మంచి స్పందన వస్తున్నదని మేకర్స్ ఆనందం వెలిబుచ్చారు. సెప్టెంబర్‌లో సినిమా విడుదల చేయనున్నట్టు ఇప్పటికే ప్రకటించారు. తాజాగా ఈ సినిమా డబ్బింగ్ కార్యక్రమాలు మొదలయ్యాయి. నరేశ్ కెరీర్‌లో ఇప్పటివరకూ చేయని మాస్ కేరక్టర్ ఇందులో చేస్తున్నారని, మునుపెన్నడూ చూడని కొత్త అవతారంలో నరేశ్‌ని డైరెక్టర్ సుబ్బు ప్రజెంట్ చేస్తున్నారని నిర్మాతలు తెలిపారు. అమృత అయ్యర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో రోహిణి, రావురమేశ్, అచ్యుత్‌కుమార్ ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: రిచర్డ్స్ ఎం.నాథన్, సంగీతం: విశాల్ చంద్రశేఖర్, నిర్మాణం: హాస్య మూవీస్.

'కలి' టీజర్‌ని ఆవిష్కరించిన 'కల్కి' దర్శకుడు

యువహీరోలు ప్రిన్స్, నరేశ్ అగస్త్య నటిస్తున్న సైకలాజికల్ థ్రిల్లర్ 'కలి'. శివ శేషు దర్శకుడు. లీలా గౌతమ్‌వర్మ నిర్మాత. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్‌ను అగ్ర దర్శకుడు నాగ్‌అశ్విన్ చేతుల మీదుగా విడుదల చేశారు. చిత్రయూనిట్‌కి నాగ్‌అశ్విన్ శుభాకాంక్షలు అందించారు. టీజర్ ద్వారా ఉత్పన్నమైన ప్రశ్న